సాక్షి
గుంటూరు
ఆదివారం । 26 । మార్చి । 2023



సమ్మేళనానికి ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్‌: జేఎన్‌టీయూ–ఎన్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో 27 నుంచి వచ్చే నెల 13 వరకు నిర్వహించనున్న సాంకేతిక సమ్మేళనం పోస్టర్లను శనివారం వైస్‌ చాన్సలర్‌ జీవీఆర్‌ ప్రసాదరావు ఆవిష్కరించారు.



మల్లిఖార్జునుడి సేవలో....

రెంటచింతల: స్థానిక గంగా భ్రమరాంబా మల్లిఖార్జున స్వామి వారిని ఏపీ జెన్‌కో ఎండీ శ్రీధర్‌ శనివారం దర్శించుకున్నారు. దేవాలయ అభివృద్ధిపై పలువురు ఆయనతో మాట్లాడారు.



బాపట్లలో కొవ్వొత్తుల వెలుగులు

బాపట్ల అర్బన్‌: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌ నేషనల్‌ గ్రీన్‌ కోర్‌ ఆధ్వర్యంలో ఎర్త్‌ అవర్‌ కార్యక్రమం శనివారం సాయంత్రం 3.30 నుంచి రాత్రి 7:30 గంటల వరకు నిర్వహించారు.

రంజాన్‌ వేళలు

	ఇఫ్తార్‌ (ఆది)	సహర్‌ (సోమ)
గుంటూరు	6:27	4:49
నరసరావుపేట	6:25	4:51
బాపట్ల	6:25	4:51

న్యూస్‌రీల్‌

మహిళల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వేణుగోపాల్‌ రెడ్డి

గుంటూరు వెస్ట్‌: గ్రామ స్థాయి నుంచి మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్‌ ఎం.వేణుగోపాల్‌ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారుల సమావేశం శనివారం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ గర్భిణులు, బాలికల్లో రక్త హీనతను గుర్తించి పౌష్టికాహారం, మందులు అందించాలని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు ఎత్తు, బరువును గుర్తించాలని కోరారు. బడిమానేసిన 566 పిల్లలను ఇప్పటికే చేర్పించారని మిగిలిన వారినీ గుర్తించి చేర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషణ ఆహారాన్ని తీసుకునేందుకు 5694 మంది అంగీకరించారన్నారు. వీరిలో 3,600 తీసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని చెప్పారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌ ద్వారా లక్ష్యాలు అధిగమించని అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారిణి డాక్టర్‌ శ్రావణ్‌ బాబు, డీఈఓ శైలజ, సీపీఓ ఉషశ్రీ, ఐసీడీఎస్‌ పీడీ మనోరంజని పాల్గొన్నారు.

28న కలెక్టర్స్‌ క్రికెట్‌ ట్రోఫీ టోర్నమెంట్‌

నరసరావుపేట ఈస్ట్‌: పల్నాడు జిల్లా ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న సందర్భంగా జిల్లా కలెక్టర్‌ లోతేటి శివశంకర్‌ ఆదేశాల మేరకు ఈనెల 28 తేదీ నుంచి కలెక్టర్స్‌ క్రికెట్‌ ట్రోఫీ జిల్లాస్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ ఎస్‌.పల్లవి, డీఎస్‌ఏ స్టేడియం చీఫ్‌ కోచ్‌ సి.హెచ్‌.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఏడు టీంలను ఎంపిక చేసి టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇందులో భాగంగా నరసరావుపేట నియోజకవర్గ స్థాయి టీం ఎంపికలు ఈనెల 26వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెట్‌ క్రీడాకారులు ఎంపిక పోటీలో పాల్గొనాలని కోరారు.

ఇంటర్‌ పరీక్షల్లో ముగ్గురు డీబార్‌

బాపట్ల అర్బన్‌: ఇంటర్‌ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్‌ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డీబార్‌ అయ్యారు. మాల్‌ ప్రాక్టీస్‌కు పాల్పడిన వీరిని అధికారులు గుర్తించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో ఇంటర్‌ ఫిజిక్స్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఒకేషనల్‌ ఎడ్యుకేషన్‌ అధికారి కె.ఆంజనేయులు తెలిపారు. మొత్తం 10,321 మంది విద్యార్థులకుగాను 9,786 మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు. 535 మంది గైర్హాజరవడంతో 94.82 హాజరు నమోదైనట్లు తెలిపారు. ఆర్జేడీ, డీవీఈవో, డీఈసీ, హెచ్‌పీసీ అధికారులు ఎనిమిది సెంటర్లు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు 9 కేంద్రాలు, సిట్టింగ్‌ స్క్వాడ్‌ అధికారులు నాలుగు సెంటర్లను తనిఖీ చేశారు. తాము వేటపాలెం, చీరాలలోని నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని గీతం జూనియర్‌ కాలేజీలో ముగ్గురు మాల్‌ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా పట్టుకున్నామని, వారిని డీబార్‌ చేశామని వెల్లడించారు.

ఆర్థిక చైతన్యానికి ‘ఆసరా’

- ఆర్థిక పొదుపులో మహిళలదే కీలక పాత్ర
- కలెక్టర్‌ ఎం.వేణుగోపాల్‌ రెడ్డి
- 19,163 పొదుపు సంఘాలకు రూ.163.71 కోట్లు జమ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్‌ వేణుగోపాల్‌ రెడ్డి, ఎమ్మెల్యే కిలారి రోశయ్య డిప్యూటీ మేయర్‌ సజీల

గుంటూరు వెస్ట్‌: మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో వారిలో ఆర్థిక చైతన్యం వస్తోందని కలెక్టర్‌ ఎం.వేణుగోపాల్‌ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్‌ శంకరన్‌ సమావేశ మందిరంలో నిర్వహించిన వైఎస్సార్‌ ఆసరా పథకం కార్యక్రమంలో కలెక్టర్‌ మాట్లాడుతూ 2019 ఏప్రిల్‌లో ఈ పథకం ప్రారంభమైందన్నారు. ఇప్పుడు మూడో విడతగా 19,163 స్వయం సహాయక పొదుపు సంఘాలకు రూ.163.71 కోట్లు ముఖ్యమంత్రి బటన్‌ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమచేశారన్నారు.

ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఉండే ఆర్థిక క్రమ శిక్షణ వారి కుటుంబాలకు శ్రీరామరక్షగా నిలుస్తుందని చెప్పారు. కుటుంబంలో మహిళ సంతోషంగా ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారని చెప్పారు. చిరు వ్యాపారాలతో, అత్యంత స్వల్ప మొత్తాలతో వారు కుటుంబాన్ని నడిపించే తీరు అద్భుతమని కొనియాడారు. ఇటీవల ఫిరంగిపురంలో మహిళలు ఏర్పాటు చేసిన మార్ట్‌ అత్యధిక సేల్స్‌ సాధిస్తోందన్నారు. మరో 6 నియోజకవర్గాల్లో ఇటువంటివి ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వ తపనంతా మహిళల అభివృద్ధేనన్నారు. దీంతోపాటు విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం, పేదల వైద్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శమని కొనియాడారు. అందుకే ప్రజలంతా తమ ప్రభుత్వం వైపే ఉన్నారని చెప్పారు. అనంతరం కుమ్మరి శాలివాహన కార్పొరేషన్‌ చైర్మన్‌ మండేపూడి పురుషోత్తం, నెడ్‌క్యాప్‌ రాష్ట్ర డైరెక్టర్‌ కొత్త చిన్నపరెడ్డి, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ ముంతాజ్‌ పఠాన్‌, టిడ్కో డైరెక్టర్‌ నాగేశ్వరి, సోషల్‌ వెల్ఫేర్‌ డైరెక్టర్‌ గనిక ఝాన్సీ, డిప్యూటీ మేయర్‌ షేక్‌ సజీల, కృష్ణ బలిజ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ నిర్మల, లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేసి, సంక్షేమ పథకాల ప్రత్యేక పోస్టర్‌, స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమ నిర్వహణను మెప్మా పీడీ వెంకట నారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్‌, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవితం సం'క్షేమం'గా..



నేను, నాభర్త గతంలో కూలీ పనులకు వెళ్లేవాళ్లం. ఆ పని చేయలేక టైలరింగ్‌ నేర్చుకున్నా. అప్పుడే ప్రభుత్వం ఇచ్చిన రూ.15 వేలతో కుట్టు మిషన్‌ కొనుక్కుని ఉపాధి పొందా. మరో ఇద్దరికి నేర్పించా. పిల్లలకు జగనన్న విద్యాదీవెన వస్తుంది.ఒక్క మాటలో చెప్పాలంటే జగనన్న మా జీవితాలను మార్చేశారు.

– అనూరాధ, పొన్నూరు.

త్వరలో సొంతింటికి...



జగనన్న నా చిరకాల సొంతింటి కల నెరవేర్చారు. నాకంటూ ఒక ఇల్లును ఇచ్చారు. దీంతోపాటు అమ్మఒడి వస్తుంది. మాలాంటి పేద వారికి ఇటువంటివన్నీ చాలా గొప్పవి. చిన్న చిన్న సంతోషాలతో సంబరపడిపోయే మాకు జగనన్న ఇస్తున్న కానుకలు ఎంతచెప్పినా తక్కువే.

– జే.దయామణి, గుంటూరు.

ప్రభుత్వాన్ని కాపాడుకుంటాం



పేదల కోసం తపించే ఇటువంటి ప్రభుత్వమే మాకు కావాలి. చెప్పిన ప్రకారం అన్నీ ఇస్తున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక బృందాలు తీసుకున్న రుణాలు కూడా అన్నే కడుతున్నాడు. 2017లో డ్వాక్రాలో చేరాను. తీసుకున్న మొత్తాన్ని కూడా దశలవారీగా ప్రభుత్వమే చెల్లిస్తుంది.

–జ్యోతి, తాడికొండ.



సీఎం వైఎస్‌ జగన్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి విడదల రజిని

మహిళలకు రూ.2.25 లక్షల కోట్ల లబ్ధి

- జగనన్నతోనే ఇది సాధ్యం
- మంత్రి విడదల రజిని
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చిలకలూరిపేట: వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలోనే ఏకంగా రూ.2.25 లక్షల కోట్ల విలువైన సంక్షేమాన్ని మహిళలకు అందించిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్‌ హాలులో వైఎస్సార్‌ ఆసరా మూడో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పేదలకు రూ.2.25 లక్షల కోట్ల విలువైన లబ్ధిని చేకూరిస్తే, అందులో రూ.1.41 లక్షల కోట్లు నేరుగా డీబీటీ పద్ధతిలో మహిళల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. మహిళలకు ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇంత లబ్ధి చేకూర్చలేదని చెప్పారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌ పర్సన్‌ హెనీ క్రిస్టినా, పల్నాడు జిల్లా కలెక్టర్‌ లోతేటి శివశంకర్‌, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట దోపిడీ

డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు దాడి

తెనాలిరూరల్‌: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని యువకులకు మాయ మాటలు చెప్పి ఓ మోసగాడు రూ. ఎనిమిది లక్షలు దండుకున్నాడు. రెండేళ్లవుతున్నా ఉద్యోగం ఊసే లేకపోవడంతో ప్రశ్నించిన యువకులపై కత్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన యువకులు బ్రహ్మరాజు, నాసరయ్యలు డిగ్రీ పూర్తి చేశారు. వలంటీర్లుగా పని చేసిన వీరికి బ్రహ్మరాజు బాబాయి ద్వారా గుంటూరు జిల్లా నిజాంపట్నంకు చెందిన డి. నాగరాజు (ప్రస్తుతం తెనాలి చినరావూరులో నివాసం) పరిచయమయ్యాడు. తాను ఓ రాజ్యసభ సభ్యుడి పీఏనని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని యువకులకు నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన ఇద్దరూ చెరో రూ. నాలుగు లక్షల చొప్పున నాగరాజుకు 2021లో ఇచ్చారు. ఉద్యోగం సంగతి అడుగితే దాటేస్తూ వచ్చాడు. శనివారం తెనాలికి వచ్చి డబ్బుతిరిగి ఇచ్చేయమని ఫోనులో కోరారు. చినరావూరు రైల్వే స్టేషన్‌ శివారుకు వీరిని పిలిపించిన నాగరాజు, తననే డబ్బు అడుగుతారా అంటూ సుమారు 15 మంది యువకులను కత్రలు, కత్తులతో బాధిత యువకులపై దాడి చేశాడు. ఇద్దరూ చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు.

మెరిసిన ‘కళల కాణాచి’



బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న సాయిమాధవ్‌ బుర్రా, పక్కన ఎంఎస్‌ చౌదరి, తనికెళ్ల భరణి, నటీనటులు

- రాష్ట్రస్థాయి పరిషత్‌ పోటీల్లో అంధస్వరం నాటికకు ప్రథమ బహుమతి
- పారితోషికంగా రూ.3 లక్షల నగదు బహూకరణ
- ఉత్తమ ప్రదర్శనతోపాటు రచన, దర్శకత్వం
- 'సాంఘికం'లో తెనాలికి 50 ఏళ్ల తర్వాత దక్కిన గౌరవం

తెనాలి: తెనాలికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ కళల కాణాచి పాల్గొన్న తొలి పరిషత్‌ పోటీల్లోనే ప్రదర్శించిన సాంఘిక నాటికకు ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం బహుమతులతో జయకేతనం ఎగురవేసింది. ప్రథమ బహుమతి కింద భారీనగదు మొత్తం రూ.3 లక్షల నగదును వ్యవస్థాపకుడు, ప్రసిద్ధ సినీ మాటల రచయిత సాయి మాధవ్‌ బుర్రా, దర్శకుడు డాక్టర్‌ ఎంఎస్‌ చౌదరి, నటీనట బృందం స్వీకరించింది. గోదావరి జిల్లాల్లోని రావులపాలెంలో సీఆర్‌సీ కాటన్‌ కళాపరిషత్‌ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాంఘిక నాటికల పోటీలను నిర్వహించారు. ప్రముఖ సినీనటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణి గౌరవ అధ్యక్షుడిగా ఉన్న పరిషత్‌ నిర్వహించిన ఈ పోటీల్లో పోటీలకు దేశంలో మరెక్కడా లేనివిధంగా ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయానికి రూ.2 లక్షలు, తృతీయానికి రూ.లక్ష నగదును ప్రకటించారు. వీణా అవార్డ్స్‌ పేరుతో రాష్ట్రస్థాయి సాంఘిక నాటిక, పద్యనాటక పోటీలను నిర్వహిస్తున్న కళల కాణాచి సంస్థ, తొలిసారిగా రావులపాలెం పరిషత్‌ పోటీల్లో పాల్గొంది. డాక్టర్‌ సాయిమాధవ్‌ బుర్రా సమర్పణలో ‘అంధస్వరం’ అనే డాక్టర్‌ ఎం.ఎస్‌. చౌదరి రచించిన నాటికను ఆయన దర్శకత్వంలోనే పోటీల్లో ప్రదర్శించారు. మానవతతో వ్యవహరించాల్సిన మనిషి మృగంలా ప్రవర్తిస్తున్న దుష్టాంతాలు నేటి సమాజంలో అనేకం... ముఖ్యంగా మహిళల పట్ల. అంధస్వరం నాటికకు ఇదే ఇతివృత్తం. కలల కాణాచి, తెనాలి సమాజం రాష్ట్రస్థాయి పరిషత్‌ పోటీల్లో తొలిసారిగా ప్రదర్శించిన ఈ నాటికకు ఉత్తమ ప్రదర్శన, రచన, దర్శకత్వం బహుమతులు లభించం విశేషం. ఉత్తమ ప్రదర్శన కింద రూ.3 లక్షల పరితోషికాన్ని సినీనటుడు తనికెళ్ల భరణి, శుభలేఖ సుధాకర్‌, నిర్వాహకుల చేతుల మీదుగా శుక్రవారం రాత్రి రావులపాలెంలో సాయిమాధవ్‌, ఎంఎస్‌ చౌదరి స్వీకరించారు. పద్యనాటక పోటీల్లో తెనాలి సమాజాలు నంది నాటకాలతో సహా అనేక పరిషత్తుల్లో బహుమతులు పొందుతున్నా, సాంఘిక నాటికల విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతిని గెలుచుకోవటం యాభై ఏళ్ల తర్వాత ఇదే ప్రథమమని కళల కాణాచి బృందం ఆనందం వ్యక్తంచేసింది.

రూ. 1377.53 కోట్లతో గుంటూరు సమగ్రాభివృద్ధి

గుంటూరు నగర బడ్జెట్‌ రూపకల్పన

- ప్రజారోగ్యానికి, తాగునీటికి, ఇతర మౌలిక వసతులకు పెద్ద పీట
- మార్పులు, చేర్పులతో బడ్జెట్‌ ఆమోదం



బడ్జెట్‌ సమావేశంలో మేయర్‌ కావటి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌

నెహ్రూనగర్‌ (గుంటూరు ఈస్ట్‌): నగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ శనివారం కౌన్సిల్‌ సభ్యులు ఆమోదించారు. రూ.1377.53 కోట్ల అంచనాలతో రూపొందించిన 2023–24 వార్షిక బడ్జెట్‌ నగర మేయర్‌ కావటి మనోహర్‌ నాయుడు అధ్యక్షతన సోమవారం నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్‌ హాల్‌లో బడ్జెట్‌ సమావేశం జరిగింది.

ప్రధానంగా బడ్జెట్‌లో ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పించారు. బడ్జెట్‌లో సభ్యుల సూచించిన సూచనలు, కొన్ని మార్పులు చేర్పులతో బడ్జెట్‌ ఆమోదం తెలుపుతున్నట్లు నగర మేయర్‌ కావటి మనోహర్‌ నాయుడు చెప్పారు. ఈ సమావేశంలో నగర కమిషనర్‌ కీర్తి చేకూరి, డెప్యూటీ మేయర్‌ షేక్‌ సజీల, డెప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్‌ సూపరింటెండెంట్‌, సిటీ ప్లానర్‌, డెప్యూటీ సిటీ ప్లానర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ఏకైక ఎజెండా

నగరాభివృద్ధే తమ ఏకైక ఎజెండా అని నగర మేయర్‌ కావటి మనోహర్‌ నాయుడు పేర్కొన్నారు. బడ్జెట్‌లో ప్రజారోగ్యం, పారిశుద్ధ్యానికి, తాగునీటి సరఫరా, పార్కుల అభివృద్ధి, గ్రీనరీ, రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులు చేయడం ద్వారా ట్రాఫిక్‌ సమస్య వంటి సమస్యలు తీరుతాయన్నారు. నగర నడిబొడ్డులో పీవీకే నాయుడు మార్కెట్‌ రూ.80 కోట్లతో నిర్మించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయన్నారు. శ్మశానవాటికల అభివృద్ధికి, వాటి నిర్వహణకు రూ.5 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

వీధి కుక్కలను నియంత్రించాలి

నగరంలో వీధి కుక్కల బెడద రోజు రోజుకి పెరిగిపోతుండటంతో పాటు ప్రజలను గాయపరుస్తున్నాయని కార్పొరేటర్లు కౌన్సిల్‌ లెవనెత్తగా వీధి కుక్కలకు తగిన పరిష్కారం చూపాలని కోరారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌లు మాట్లాడుతూ నగరంలో స్కూల్‌ జోన్స్‌లో వీధి కుక్కల బెడద లేకుండా ప్రజారోగ్యధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

బాగా తగ్గిన వెహికల్‌ షెడ్‌ నిర్వహణ

నగరపాలక సంస్థ వెహికల్‌ షెడ్‌లో గత కొన్నేళ్లుగా భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయని...దీనికి సంబంధించి సరైన రికార్డులు కూడా మెయింటైన్‌ చేయడం లేదని గత కౌన్సిల్‌ సమావేశాల్లో డెప్యూటీ మేయర్‌ వనమా బాలవజ్రబాబు లెవనెత్తిన నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్‌లో కోట్లల్లో వ్యత్యాసం కనిపించింది.

బడ్జెట్‌ స్వరూపం ఇలా...

	రూ. కోట్లలో
ప్రారంభ నిల్వ	608,93,78,449
జమలు	768,59,73,850
మొత్తం	1337,53,52,299
ఖర్చులు	976,25,98,460
అంత్య నిల్వ	401,27,53,839

కేటాయింపులు ఇవీ...

	రూ. కోట్లలో
పారిశుద్ధ్య నిర్వహణకు	54.30
వీధి కుక్కల నియంత్రణకు	2
వీధి దీపాల నిర్వహణకు	7
తాగునీటి సరఫరాకు	14.50
పార్కులకు,గ్రీనరీ	17
రోడ్లు	80
డ్రైన్లు	30
పీవీకే నాయుడు మార్కెట్‌	80
రోడ్డు జంక్షన్లకు	5
ఆర్వోబీ, ఆర్‌యూబీలకు	10
శ్మశాన వాటిక నిర్వహణకు	5
స్టేడియం అభివృద్ధి	రూ.50 లక్షలు
ప్రజారోగ్యం	రూ.54 లక్షలు

నిరంతర శ్రమే విజయానికి నాంది

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్


మాట్లాడుతున్న జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో విజయం సాధించేందుకు దగ్గర దారులు లేవని, శ్రమతోనే దానిని సాధించవచ్చునని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. శనివారం నవభారత్‌నగర్‌లోని జేసీ లా కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులు తమ సీనియర్ల నుంచి ఎన్నో విషయాలను నేర్చుకునేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. న్యాయవాదికి భావ వ్యక్తీకరణ మూలమని, ఎవరైతే చక్కటి వాగ్ధాటి కలిగి ఉంటారో వారు న్యాయవాద వృత్తిలో పేరు, ప్రఖ్యాతులతో పాటు సక్రమ మార్గంలో ధనాన్ని సైతం సంపాదించవచ్చని అన్నారు. కళాశాల పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల స్థాపన ప్రధాన ఉద్దేశం డబ్బు సంపాదన కాదని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమేనన్నారు. కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి మాట్లాడుతూ కళాశాలలో చక్కటి గ్రంథాలయంతో పాటు ప్రతి వారం మూట్ కోర్టు ద్వారా వాదోపవాదాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వాదనాపటిమ పెరుగుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ 2020, 2023 సంవత్సరాల్లో జాతీయస్థాయిలో మూట్ కోర్టు పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జస్టిస్ కృపాసాగర్ బహుమతులు అందజేశారు. జస్టిస్ కృపాసాగర్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీలు సుప్రజ, మహేష్, శ్రీనివాసరావు

జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ కోరారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో నేర సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అరెస్టు వారెంట్‌లను ప్రత్యేక బృందాలతో జారీ చేయాలన్నారు. పోక్సో కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, దర్యాప్తు అధికారి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయాలని పేర్కొన్నారు. నూతన, మారుతున్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు, నాటు సారా, గంజాయి, గుట్కా, ఖైనీ, నిషేధిత పదార్థాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చోరీలు అరికట్టేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాలు జరిగే ప్రాంతాల్లో రాత్రి, పగలు పోలీసుల గస్తీ ముమ్మరంగా చేపట్టాలని అన్నారు. రక్షక్, పోలీస్ వాహనాలతో నిరంతరం పెట్రోలింగ్ నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జైళ్ల నుంచి విడుదలైన నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందనకు వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత వేళల్లో చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాలల్లో ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), డీఎస్ మహేష్(ఎస్ఈబీ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు సీతారామయ్య, శ్రీనివాసరావు, పోతురాజు, జేస్సి ప్రశాంతి, ప్రకాష్‌బాబు, మెహబూబ్ సుభానీ, చంద్రశేఖర్‌రావు, విజయశేఖర్, ఎస్బీ, డీసీఆర్బీ, సీసీఎస్ సీఐలు బి.నరసింహారావు, శ్రీనివాస్‌రావు, బాలసుబ్రహ్మణ్యం, డి.వెంకన్నచౌదరి, ప్రేమయ్య, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, ఐటీ కోర్ ఇన్‌చార్జి డి.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పెరిగిన బీటీ-2 పత్తి విత్తన ధరలు

కొరిటిపాడు(గుంటూరు): బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ ధర భారీగా పెరిగింది. హైబ్రిడ్‌లో బీటీ-1, బీటీ-2 పత్తి విత్తన రకాలు ఉన్నా... రైతులు బీటీ-2 విత్తనాలనే వినియోగిస్తున్నారు. బీటీ-1 విత్తన ప్యాకెట్ ధరలో ఎలాంటి మార్పు లేకపోయినా.. బీటీ-2 పత్తి విత్తనాల ధరను కేంద్ర ప్రభుత్వం పెంచుతూ పోతోంది. 2022-23లో బీటీ-2 పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.810 కాగా.. 2023-24 సంవత్సరానికి రూ.853 చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లెక్కన 450 గ్రాముల ప్యాకెట్‌పై రూ.43 పెరగడం గమనార్హం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 1.82 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతోంది. బీటీ-2 పత్తి ప్యాకెట్లు సుమారు 10 లక్షల వరకు వినియోగిస్తున్నారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులపై రూ.4.30 కోట్ల అదనపు భారం పడనుంది.

మంత్రి కాన్వాయ్‌లో అపశ్రుతి

ఏఆర్ ఎస్ఐకు గాయాలు

తాడేపల్లి రూరల్: జాతీయ రహదారిపై కుంచనపల్లి వద్ద మంత్రి కాన్వాయ్‌లో శనివారం అపశ్రుతి చోటుచేసుకుంది. సెక్యూరిటీ వాహనం ఎదురుగా వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఏఆర్ ఎస్ఐ గాయపడ్డాడు. వివరాలు.. మంగళగిరి వైపు నుంచి కార్మిక శాఖ మంత్రి ఎం.జయరామ్ తాడేపల్లి వైపు వస్తున్నారు. ఈ సమయంలో మంత్రి కాన్వాయ్‌లో ఉన్న పైలెట్ వాహనం ఎదురుగా వెళుతున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాన్వాయ్‌లో ఉన్న ఏఆర్ ఎస్ఐ కోటేశ్వరరావు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వేరొక వాహనంలో మణిపాల్ ఆస్పత్రికి తరలించారు.

వైద్య విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేత



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌కు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి క్రీడా పరికరాలను శనివారం సాయంత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా కొంత సమయం క్రీడలకు కేటాయించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతోందని వెల్లడించారు. కళాశాల డెవలప్‌మెంట్ సొసైటీ ఫండ్(సీడీఎస్) ద్వారా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ వినోద్‌కుమార్ అనుమతితో సుమారు రూ.3 లక్షలు ఖరీదు చేసే పరికరాలను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈసందర్భంగా వైద్య విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, హాస్టల్ వార్డెన్, ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మంచికలపాటి సుబ్బారావు, డెప్యూటీ వార్డెన్, ఎస్పీఎం డిపార్టుమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్రాంత పాత్రికేయుడు భాస్కరరావు మృతి



తెనాలి: విశ్రాంత పాత్రికేయుడు, ఫిల్మ్ ఎడిటర్ వీరంకి భాస్కరరావు(62) ఆకస్మిక మృతి చెందారు. కొత్తపేటలోని తన నివాసంలో నిద్రలోనే మృతి చెందారు. ఉదయం 9.20 గంటల ప్రాంతంలో ఇంటికొచ్చిన స్నేహితుడు గమనించి బంధువులకు సమాచారం పంపారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో కార్డియాక్ అరెస్ట్ సంభవించి ఉంటుందని పరీక్షించిన వైద్యుడు అభిప్రాయపడ్డారు. భాస్కరరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. బంధుమిత్రులు ఆయన భౌతికకాయాన్ని స్వస్థలమైన దుగ్గిరాల మండల గ్రామం మంచికలపూడి తరలించారు. అదే గ్రామంలో అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని సోదరుడు రాజా తెలిపారు.